క్లుప్తంగా

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రాజాం సిటీ: స్థానిక సీనియర్, జూనియర్ కోర్టు సముదాయంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్తచట్టాలకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. తక్షణమే కేంద్రం స్పందించి కొత్తచట్టాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిమిడి రామానాయుడు, ఉపాధ్యక్షుడు ఆర్ఈజీహెచ్ జయదేవ్, ప్రధాన కార్యదర్శి వై.ఈశ్వరరావు, న్యాయవాదులు ఎం.శ్రీనివాసరావు, ప్రసాద్, దామోదరరావు, ఎస్.అప్పలనాయుడు, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో సునీల్‌కుమార్

తెర్లాం: నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగులమందులు విక్రయిస్తే విత్తనచట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఏవో జి.సునీల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన.. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న స్టాక్‌కు, రికార్డులో పేర్కొన్న వివరాలకు సరిపోయిందా లేదా అనేది సరిచూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేయడం జరుగుతోందని, దుకాణదారులు తమ వద్దకు వచ్చే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులే ఇవ్వాలని తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈవోలు బి.ప్రవీన్‌కుమార్, వై.దుర్గారావు సూచించారు. స్థానిక చీపురుపల్లి రోడ్డులోని శ్రీవత్సల హైస్కూల్‌లో సపోర్టివ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రెనింగ్ ప్రోగ్రాంను వారు సోమవారం పరిశీలించారు. ఇక్కడ నేర్చుకునే అంశాల ఆధారంగా తరగతుల్లో బోధన చేయాలన్నారు. ప్రతీ విద్యార్థి అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రెనీ మాస్టర్‌లు రవిశంకర్, గురుమూర్తి, సత్యనారాయణ, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందిస్తున్న యువజన సంఘం సభ్యులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పలువురు యువకులు విద్యాసామగ్రి సోమవారం అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే పాఠశాలలో చదువుతున్న 46 మంది విద్యార్థులకు తమ వంతు సాయంగా నోటుపుస్తకాలు, పెన్నులు, ఐడీకార్డులతో పాటు ఇతర వస్తుసామగ్రిని అందించామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నూకరాజు, యువజన సంఘం సభ్యులు గార సత్యనారాయణ, రెడ్డి శ్రీనివాసరావు, జల్ల త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టే ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా మండలానికి సంబంధించిన సమస్యలను అక్కడి నుంచి పంపించిన వెంటనే వాటిని సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రతీ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'స్టాప్ డయేరియా'ను విజయవంతం చేయాలి

- బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.నరేంద్ర



రాజాం సిటీ: బొద్దాంలో ర్యాలీ నిర్వహించి, డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రాజాం సిటీ: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి బి.నరేంద్ర కోరారు. మండల పరిధిలోని బొద్దాం గ్రామ పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఆయన.. ఈ నెల 1వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమంలో 6 నెలల నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు డయేరియా సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీళ్ల విరేచనాలను అరికట్టేందుకు ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్ పౌడర్‌ను లీటరు వేడి నీటిలో కలిపి కొద్దికొద్దిగా తాగించడంతో పాటు 14 రోజుల పాటు మాత్రలు వాడి డయేరియా నుంచి పిల్లలను కాపాడాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టి, డయేరియా నిర్మూలనకు పాటించాల్సిన చర్యలపై వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



రామభద్రపురం: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, వైద్యాధికారి దిలీప్‌కుమార్



రేగిడి: డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు

రామభద్రపురం: డయేరియా నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు చేతులమీదుగా సోమవారం ఆవిష్కరించారు. ప్రస్తుత వర్షాకాలంలో విజృంభించే డయేరియాను సమూలంగా రూపుమాపేందుకు వైద్యసిబ్బంది కృషి చేయాలని, ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ రోగాల బారినపడకుండా ఉండాలని ఎంపీపీ కోరారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో ఎల్‌హెచ్‌పీలు, ఆశ, ఏఎన్ఎంలు కలిసి ఇంటింటికీ వెళ్లి, వేటి ద్వారా డయోరియా వస్తుంది..తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లోని మురుగునీటి నిల్వల కారణంగా దోమలు పెరిగే అవకాశం ఉందని, తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు వస్తాయన్నారు. జ్వరలక్షణాలతో బాధపడే ఎవరైనా వెంటనే ఆస్పత్రిని సంప్రదించి, వైద్యసేవలు పొందాలన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం..

రేగిడి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చందక అసిరినాయుడు అన్నారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో స్టాప్ డయేరియా కార్యక్రమం సోమవారం చేపట్టి, ఆ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేడి,వేడి ఆహార పదార్థాలు తినాలని, కాచివడపోసి, చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. రోడ్డు పక్క ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ల వద్ద విక్రయిస్తున్న ఆహార పదార్థాలను తినవద్దన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలి



వండానపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు చేయడంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. వంటగది శుభ్రంగా ఉండాలని, వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, పదార్థాలపై మూతలు పెట్టాలని, వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు వడ్డించాలని, కాచివడపోసిన నీటిని తాగేందుకు అందుబాటులో ఉంచాలని వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల వద్దకు తరగతుల వారీగా వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు అడ్డుకోండి



సర్పంచ్ అప్పలనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణ

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో ఉన్న ఇద్దువాని చెరువగట్టుపై జరుగుతున్న ఆక్రమణలు అడ్డుకోవాలని సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడుని గ్రామానికి చెందిన యూత్ సభ్యులు రెయ్యి రామకృష్ణ, బి.శంకరరావు తదితరులు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. కొంతమంది చెరువుగట్టు ఆక్రమించి షెడ్లులు వేస్తున్నారని, రాత్రి సమయంలో ప్రమాదకరమైన మెడికల్ వస్తుసామగ్రిని చెరువులో పడేస్తున్నారని తెలిపారు. ఇదే చెరువునీరు పంటపొలాలకు వెళ్లడంతో పాటు మూగజీవాలు తాగుతున్నాయని ఈ నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. వ్యర్థాలు చెరువులో పడేయకుండా చూడాలని, చెరువుగట్టు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాస్తారోకో



కొత్తచట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు, సీఐటీయూ నేతలు

రామభద్రపురం: కేంద్రం చేసిన కొత్త చట్టాలకు వ్యతిరేకంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, మండల కార్యదర్శి బలస శ్రీనువాసరావుల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఆటో డ్రైవర్లు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న భారత న్యాయ సంహిత చట్టం.. డ్రైవర్ల మెడకు ఉరితాడులాంటిదని వ్యాఖ్యానించారు. దేశంలో మోదీ ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాలలో ఐపీసీ చట్టానికి బదులుగా బీఎన్ఎస్ అమలు చేస్తూ డ్రైవర్లను ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించారు. ఈ చట్టాలు.. రోడ్డు ప్రమాదాల్లో డ్రైవర్లది తప్పు లేకున్నా వారి నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందన్నట్లు చెబుతున్నాయన్నారు. ఈ చట్టాలను వెనక్కి తీసుకోకుంటే ఈ నెల 10వ తేదీ నుంచి మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం చేసిన ఈ చట్టాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ బొబ్బిలి రూట్ అధ్యక్షుడు లోకేష్, అప్పారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు సోమవారం కలిసి పరామర్శించారు. సర్పంచ్ కుటుంబ సభ్యుల్లో ఒకరైన లక్ష్మి.. కాలువిరిగి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయా నేతలు ఆ గ్రామం వెళ్లి, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సంకిలి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెంబూరి గోపాలకృష్ణ, అప్పాపురం, వన్నలి, ఆడవరం పంచాయతీల సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, గార రమణ, మొయ్యి కృష్ణమూర్తినాయుడు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



మెంటాడలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి



తెర్లాంలో దివ్యాంగురాలైన చిన్నారికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బేబి నాయన



తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా

బొబ్బిలి, బొబ్బిలి రూరల్, తెర్లాం, బాడంగి, రామభద్రపురం, రాజాం, రేగిడి: మండలాల్లోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం చేపట్టారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, డప్పు కళాకారులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు వారి వద్దకు వెళ్లి, పెన్షన్ నగదు అందజేశారు. మెంటాడలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, తెర్లాం మండల కేంద్రంతో పాటు, బొబ్బిలి మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. కొన్నిచోట్ల సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యం కాగా లబ్ధిదారులు గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది.

పచ్చిరొట్టతో భూసారం

బాడంగి: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని ఏవో కె.శిరీష తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు ప్రధాన పంట సాగుచేసుకోవడానికి ముందు భూసారం కోసం పచ్చిరొట్టను సాగుచేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట మొక్కలను అదే నేలలో కలియదున్నాలని తద్వారా భూసారం పెరిగి, ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. అలాగే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

'ఉపాధి' క్షేత్ర సహాయకుడిపై ఫిర్యాదు

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామ ఉపాధి హామీ పథకం పనుల క్షేత్ర సహాయకుడిపై ఆ గ్రామానికి చెందిన కొంతమంది ఎంపీడీవో బి.మధుసూదనరావుకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వారు వెళ్లి, సదరు వ్యక్తి మస్తర్లలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు చెప్పి, చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో.. దర్యాప్తు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు మేకల శాలల దగ్ధం



కాలిపోయిన మేకల శాలల ప్రాంతం

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో సోమవారం ఉదయం 8 గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో జాడ సత్యం, జాడ పోలయ్యలకు చెందిన రెండు మేకల శాలలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ వంగల లక్ష్మీరాణి సంఘటన స్థలాన్ని పరిశీలించి, జరిగిన నష్టానికి పరిహారం వచ్చేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి, శాలలు కాలిపోయినట్లు పంచాయతీ కార్యదర్శి షేక్ అజార్ తెలిపారు.

కనీస సదుపాయాలు కల్పించండి

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్ వద్ద ఉన్న ఎస్సీ హాస్టల్‌లో కనీస సదుపాయాలు కల్పించాలని ఏపీ విద్యార్థి జేఏసీ ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ కోరుతున్నారు. సోమవారం హాస్టల్ పరిశీలనకు వెళ్లిన ఆయన దృష్టికి తాగునీరు, విద్యుత్ లైట్లు లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం వచ్చింది. ఈ మేరకు ఆయన విద్యార్థుల చదువు, ఉండేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, పాడైన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బాగుచేయించాలని విజ్ఞప్తి చేశారు.

ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు తదితరులు

బొబ్బిలి: ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు వి.శేషగిరిరావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో వారు సోమవారం మాట్లాడుతూ ఈపీఎఫ్ పింఛన్‌దారులకు న్యాయం జరిగేలా ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ పెంచాలని కోరుతూ ఆగస్టు 6వ తేదీ నుంచి మూడురోజుల పాటు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. దేశంలోని 75 లక్షల మంది పెన్షనర్లకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఈపీఎఫ్ పింఛన్.. రాష్ట్రంలో ఇస్తున్న సామాజిక పింఛన్ కన్నా తక్కువగా ఉండడం దారుణమన్నారు. ఈపీఎఫ్ పింఛన్ పెంపు కోరుతూ ఈ నెల 10వ తేదీన అన్ని మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన చేపడుతున్నారు. కార్యక్రమంలో పి.కృష్ణ, భుజంగరావు, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



దేవుదళ కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో-2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని దేవుదళ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఆయన సోమవారం సందర్శించి, అక్కడి విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి, వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా, చదువుపై వారికి ఆసక్తి రేకెత్తించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని తెలిపారు. అంతకుముందు పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ విధానం లాభదాయకం



డ్రమ్ సీడర్ విధానంలో వరినాట్లు వేయడంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేగిడి: రైతులు వరిపంటను సాగుచేసే సమయంలో డ్రమ్ సీడర్ విధానాన్ని అవలంభిస్తే లాభదాయకమని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని ఏవో మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రెనర్ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ఉంగరాడ గ్రామ పంటపొలాల్లో డ్రమ్ సీడర్ విధానం ద్వారా వరినాట్లు వేయడంపై అక్కడి రైతులకు అవగాహన కల్పించారు. గులివిందల సూర్యనారాయణ అనే రైతుకు చెందిన ఆరు ఎకరాల పొలంలో డ్రమ్ సీడర్ ద్వారా వరినాట్లు వేయించారు. ఈ విధానం ద్వారా మొక్కకు మొక్కకు మధ్య ఉండాల్సిన ఖాళీ ఉంటుందని, దీంతో గాలి, వెలుతురు, నీరు సమృద్ధిగా లభించి, పంట ఏపుగా పెరుగుతుందన్నారు. అలాగే పంట సాగుకు అయ్యే ఖర్చు తగ్గి, దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ రేఖ, యూనిట్ ఇన్‌చార్జ్ పార్వతమ్మ, రెడ్డీస్ ఫౌండర్ సీఎఫ్ శరత్‌కుమార్, ఐసీఆర్‌పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైన కలెక్టర్.. ప్రతీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్‌సెల్) కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని, ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, ఏవో శ్యామ్‌సుందర్, పక్కి, పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పరలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం



గ్యాస్ లీకేజీ ప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు

వంగర: మండలంలోని వంగర గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులకు అగ్నిప్రమాదాలు, తుపానులు, వరదలు, భూకంపాలు, పాముకాటు బారినపడి ప్రాణాలు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను ప్రదర్శన ద్వారా బృంద సభ్యులు వివరించారు. విశాఖపట్నం 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్‌కుమార్ బెహరా మాట్లాడుతూ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవించినా తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం జరగకుండా చేయొచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి పరాగ్, రాజాం ఫైర్ ఆఫీసర్ ఎస్.ఎస్.జనార్దనరావు, ఆర్ఐ జామి మురళి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచట్టాలపై అవగాహన పెంచుకోండి



కొత్తచట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ కొండలరావు

బాడంగి: ఐపీసీ పాతచట్టాల స్థానంలో బీఎన్ఎస్ పేరుతో వచ్చిన కొత్తచట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఏఎస్ఐ డి.కొండలరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో సోమవారం సమావేశమై, కొత్తచట్టాలపై అవగాహన కల్పించారు. జూలై ఒకటో తేదీ నుంచి ఈ చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. గతంలో వరకట్నం వేధింపులకు సంబంధించి, ఐపీసీ 498 సెక్షన్‌కు బదులు కొత్తగా బీఎన్ఎస్ 85 సెక్షన్ వచ్చిందన్నారు. అలాగే హత్యాయత్నం కేసుకు సంబంధించి, గతంలో ఐపీసీ 302 సెక్షన్‌కు బదులుగా బీఎన్ఎస్ 103 సెక్షన్, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి, గతంలో ఉన్న ఐపీసీ 304 సెక్షన్ స్థానంలో బీఎన్ఎస్ 106 సెక్షన్ అమల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి గుణుపూరు స్వామినాయుడు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఐపీసీ పాతచట్టాల స్థానంలో తీసుకువచ్చిన కొత్తచట్టాలపై ఎస్ఐ షేక్‌శంకర్ సోమవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఈ కొత్తచట్టాల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు.

అధైర్యపడొద్దు.. మంచిరోజులు వస్తాయి..

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారణమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, మనకు మళ్లీ మంచి రోజులు వస్తాయని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పూడి సత్యంను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి మండల కేంద్రంలో సోమవారం కలిసి పరామర్శించారు. ఆయన అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా ఎవరూ ఏమీ అనవద్దన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అందరం ఒక్కటేనన్న భావనతో అందరూ వ్యవహరించాలని హితవుపలికారు. కూటమి అధికారంలోకి వచ్చిన 15 రోజులకే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు తదితరులు పాల్గొన్నారు.